

ఆలయ భూములకు రక్షణ కరువు

రూ. కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పలు ఆలయాల భూములు అన్యాక్రాంతమయ్యాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు అక్రమార్కులకు సహకరించారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికార యంత్రాంగం కూడా ఉదాసీనంగా వ్యవహరించడంతో అక్రమణదారులకు అడ్డే లేకుండాపోయింది. కోట్లాది రూపాయల విలువైన ఆలయ భూములు అక్రమణలకు గురికావడం పట్ల భక్తులు ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం ఆలయ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

- మారేపల్లిలో ఆగ్రోఫామ్, అక్రమ లేఅవుట్
- అనకాపల్లిలో హెచ్చరిక బోర్డులు పాతినా వదలని అక్రమార్కులు
- గత వైసీపీ ప్రభుత్వంలో పార్టీ నేతల అండతో చెలరేగిపోయిన ఆక్రమణదారులు
- అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరించడంపై విమర్శలు
- కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని భక్తుల ఆశాభావం



అనకాపల్లి సత్యనారాయణస్వామి దేవస్థానం భూమిలో ప్రైవేటు లేఅవుట్‌కు వెళ్లేందుకు రోడ్డు వేసుకున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

అనకాపల్లి పట్టణ నడిబొడ్డున పూల్‌బాగ్‌లోని సర్వే నంబర్ 66లో విశాఖపట్నానికి చెందిన సీతారామచంద్ర స్వామి దేవస్థానం (అంబికాబాగ్)కు 29.71 ఎకరాల భూమి ఉంది. దీనిపై గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ స్థానిక నేత ఒకరు కన్నేశారు. సుమారు రూ.60 కోట్ల విలువైన ఆ భూమిని కాజేసేందుకు ప్రయత్నించారు. దీనిపై దేవదాయ శాఖాధికారులు కోర్టును ఆశ్రయించారు. ఆ భూమి వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అయినా ఇటీవల కొందరు మళ్లీ ఆ భూమిని తమ ఆధీనంలోకి తీసుకునే ప్రయత్నం చేశారు. సీపీఎం నాయకులు, దేవదాయశాఖ అధికారులు ప్రతిఘటించడంతో వెనక్కి తగ్గారు.

అనకాపల్లి మండలం సత్యనారాయణపురం పంచాయతీలో సత్యనారాయణస్వామి దేవస్థానానికి చెందిన 7.17 ఎకరాల భూమిని కబ్జా చేసేందుకు కొందరు గత ఏడాది స్కెచ్ వేశారు. సర్వే నంబరు 633/2లో ఎకరా 94 సెంట్లు, 633/3ఏలో 5.23 ఎకరాలు. వెరసి 7.17 ఎకరాల దేవస్థానం భూమిని కబ్జా చేసి, స్థలానికి వెనుక వైపు ఉన్న ఒక ప్రైవేటు లేఅవుట్‌కు రహదారి వేశారు. మీడియాలో కథనాలు రావడంతో అప్పట్లో దేవదాయ శాఖ అధికారులు ఆదరాబాదరాగా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. తరువాత ఈ భూమిని సర్వే చేశారు. సర్వే నివేదిక వచ్చిన తరువాత చుట్టూ కంచె వేయిస్తామని చెప్పారు. కానీ ఇంత వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు.



దేవరాపల్లి మండలం మారేపల్లిలోని ఆలయ భూముల్లో ఆగ్రోఫామ్

దేవరాపల్లి మండలం మారేపల్లి రెవెన్యూ సర్వే నంబరు 115లో 23 ఎకరాల 15 సెంట్ల దేవదాయ శాఖకు చెందిన శ్రీరాములు దేవస్థానం భూముల్లో ఒక రియల్టర్ ఏకంగా కవిత అగ్రిఫామ్ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఈ భూములు మార్కెట్ రేటు ప్రకారం రూ.23 కోట్లు పలుకుతోంది. దేవాలయ భూములను కొందరు కౌలుకు తీసుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడంపై దేవదాయ శాఖకు ఫిర్యాదులు అందాయి. స్థానిక వైసీపీ నేత ఒకరు అగ్రిఫామ్ అధినేతకు వత్తాసు పలకడమే కాకుండా ఆలయ భూములు తమవంటూ కోర్టులో కేసు వేశారు. దేవదాయ శాఖ కూడా ఈ భూముల విషయమై కోర్టును ఆశ్రయించింది. ఇవే కాకుండా జిల్లాలో ఎలమంచిలి, పాయకరావుపేట, నక్కపల్లి, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల మండలాల్లో ఆలయ భూములు కౌలు పేరుతో కొందరు తమ ఆధీనంలో ఉంచుకున్నట్టు సమాచారం. కొందరు ఆలయ భూములను తమకు వారసత్వంగా వచ్చిన ఆస్తిగా చెప్పుకొని క్రయ విక్రయాలు సాగిస్తున్నట్టు తెలిసింది. కొందరైతే ఆలయ భూములకు తమ పేరు మీద నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఆక్రమణకు పాల్పడినట్టు సమాచారం.

అధికారుల మధ్య సమన్వయ లోపం

అనకాపల్లి, ఎలమంచిలి, పాయకరావుపేట, వి.మాడుగుల, దేవరాపల్లి, చోడవరం, నర్సీపట్నం పరిసర ప్రాంతాల్లో దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాలకు సుమారు రెండు వేల ఎకరాలకు పైగా భూములు ఉన్నాయి. ఆలయ భూముల పరిరక్షణ విషయంలో రెవెన్యూ, దేవాదాయ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల అనేక చోట్ల ఆలయ భూములను కౌలుకు తీసుకున్న వారు సొంతం చేసుకొని తమ ఆధీనంలో ఉంచుకున్నారు. ఆక్రమణ దారులకు పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు సహకరించడం, కొందరు రాజకీయ నాయకుల జోక్యం కారణంగా ఆలయ భూములకు రక్షణ కరువైందన్న వాదన వినిపిస్తోంది. ఇప్పటికైనా దేవదాయ శాఖకు చెందిన రూ.కోట్లు విలువైన భూముల పరిరక్షణకు రెవెన్యూ, పోలీసు, దేవదాయ శాఖ అధికారులు ఉమ్మడిగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఇసుక లెక్క తేలేదెన్నడో?

కొలిక్కి రాని గబ్బాడ ఇసుక డిపో వివాదం

- రెండు నెలలుగా డిపోలో 63 టన్నులు
- ఎవరు నిల్వ చేశారో విచారణ చేయాలని స్పీకర్ ఆదేశం
- నోరు మెదపని మైనింగ్ అధికారులు
- నిలిచిపోయిన ఇసుక విక్రయాలు
- ఇసుక దొరక్క గృహ నిర్మాణదారుల ఇబ్బందులు

నర్సీపట్నం, ఆగస్టు 10: **గబ్బాడ ఇసుక డిపో వివాదం రెండు నెలలైనా ఓ కొలిక్కి రాలేదు. డిపోలో ఇసుక నిల్వలు ఎవరివో తేల్చాలని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు ఆదేశించినా మైనింగ్ అధికారులు నోరు మెదపడం లేదు. దీంతో ఈ డిపో నుంచి ఇసుక విక్రయాలు జరగడం లేదు. ఇసుక దొరక్క గృహ నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారు.**



గబ్బాడ ఇసుక డిపో

గత నెల 6న జాయింట్ కలెక్టర్ జాహ్నవి గబ్బాడ ఇసుక డిపోను డీపీవో, ఆర్డీవో, పోలీస్, మైనింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఎంత పరిమాణంలో ఇసుక నిల్వలు ఉన్నాయో లెక్కలు తేల్చాలని అధికారులను ఆదేశించారు. ఎనిమిదో తేదీ నుంచి ఇసుక విక్రయాలు మొదలు పెట్టాలని సూచించారు. మైనింగ్ అధికారులు డిపోలో సుమారు 48,204 టన్నుల ఇసుక ఉన్నట్టు లెక్కలు తేల్చారు. అయితే స్పీకర్ అయ్యన్నపాత్రుడు గబ్బాడ డిపోలో 65 వేల టన్నుల ఇసుకను అక్రమంగా నిల్వ చేశారని, ఇసుక నిల్వ చేసిందెవరో తేల్చే వరకు ఇసుక అమ్మకాలు చేయ వద్దని హెచ్చరించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పిన ఇసుక నిల్వలు, అధికారులు తేల్చిన ఇసుక నిల్వలకు మధ్య 16 వేల టన్నులు తేడా వస్తోంది. ఈఇసుక ఏమైందో మైనింగ్ అధికారులు ఇంత వరకు తేల్చలేదు. అయితే ఇసుకను అక్రమంగా తరలించకుండా డిపో చుట్టూ ఐదు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీసులతో కాపలా ఏర్పాటు చేశారు.

ఇసుక దొరక్క ఇబ్బందులు

గబ్బాడ డిపోలో అధికారికంగా ఇసుక విక్రయాలు జరగకపోవడంతో గృహ నిర్మాణదారులు ఇబ్బంది పడుతున్నారు. రాజమండ్రి నుంచి టిప్పర్లు, లారీలతో ఇసుక తీసుకు వచ్చి బలిఘట్టం కాటా వద్ద ట్రాక్టర్లతో విక్రయాలు జరుపుతున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.7 వేలుకి పైగా ధర పలుకుతోంది. గత నెల 12 తేదీన సెబ్ అధికారులు మూడు ట్రాక్టర్లు పట్టుకుని రూ.10 వేలు అపరాధ రుసుము వసూలు చేసి విడిచి పెట్టారు. పట్టణ పోలీసులు కూడా ట్రాక్టర్‌ను పట్టుకొని మైనింగ్ అధికారులకు అప్పగించారు. తరువాత ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవడం మానేశారు. జిల్లా ఇసుక కమిటీ నిర్ణయించిన ఇసుక ధర అన్ని ఖర్చులు కలుపుకొని రూ.1,225లు కాగా, ప్రైవేటు వ్యక్తులు రూ.1,450లకు విక్రయిస్తున్నారు. దీనికి ట్రాక్టర్ రవాణా చార్జీలు అదనం. బలిఘట్టంలో బహిరంగంగానే అక్రమంగా ఇసుక విక్రయాలు జరుగుతున్నా మైనింగ్, సెబ్ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం రాజమహేంద్రవరం నుంచి ఇసుకను ఇక్కడకు తీసుకు వచ్చి విక్రయాలు జరపకూడదు. ఇసుక సొంత అవసరాలకు మాత్రమే వాడుకోవాలి. రెండు నెలలుగా ఇసుక సరిగ్గా దొరక్కపోవడంతో గృహ నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. గబ్బాడ ఇసుకను అందుబాటులోకి తీసుకు రావాలని గృహ నిర్మాణదారులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

- చినదొడ్డిగల్లు, ఎన్.నర్సాపురం గ్రామాల్లో విషాదం



పాలూరి రమేశ్ (ఫైల్)



దాకారపు రాములు (ఫైల్)

నక్కపల్లి, ఆగస్టు 10: విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి చెందారు. మండలంలోని వేర్వేరు గ్రామాల్లో శనివారం ఈ సంఘటనలు జరిగాయి. విద్యుత్ తీగలపై వున్న చెట్టుకొమ్మలను తొలగిస్తుండగా చినదొడ్డిగల్లు గ్రామంలో ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. అలాగే ఎన్.నర్సాపురం గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ కొండ వెనుకపాలెం గ్రామంలో నిర్మాణంలో వున్న ఒక ఇంటికి వైరింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ రెండు సంఘటనలకు సంబంధించి నక్కపల్లి ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి.

నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన పాలూరి రమేశ్ (25) పాయకరావుపేట మండలం డెక్కన్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం తన ఇంటి మేడ ఎక్కి విద్యుత్ తీగలపై వున్న చెట్టు కొమ్మలను తొలగిస్తున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. అక్కడికక్కడే అతను కుప్పకూలిపోవడంతో కుటుంబసభ్యులు నక్కపల్లి సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదే మండలం ఎన్.నర్సాపురం గ్రామానికి ... మిగతా 8వ పేజీలో

స్మార్ట్ మీటర్లు

రాష్ట్రంలో మొట్టమొదట ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఏర్పాటుకు శ్రీకారం

- తొలుత ప్రభుత్వ కార్యాలయాలకు ఆ తరువాత వాణిజ్య వినియోగదారులకు...
- అనంతరం గృహ వినియోగదారులకు కేటాయింపు
- ఎక్కువ విద్యుత్ వాడే వారికి మాత్రమే ఏర్పాటు
- మొబైల్‌లా ముందస్తుగా రీచార్జి చేసుకోవలసి ఉంటుందన్న అధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటి నుంచో చెబుతున్న స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ విశాఖపట్నంలో మొదలైంది. తొలి మీటరును సీతమ్మధారలోని ప్రజారోగ్య శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో ఏర్పాటుచేశారు. వీటిని మొదటి దశలో ప్రభుత్వ కార్యాలయాలకు పెడతారు. ఈపీడీసీఎల్ (తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ) పరిధిలో గల ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో మొత్తం మూడు వేల వరకూ ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ప్రస్తుతానికి 500 మీటర్లు మాత్రమే రావడంతో వాటిని అమరుస్తున్నారు. ఆ తరువాత వాణిజ్య వినియోగదారులకు ఇస్తారు. వారి సంఖ్య 1.1 లక్షల వరకూ ఉంది. ఇదంతా పూర్తయ్యాక గృహ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లను అందిస్తారు. వారిలో కూడా అత్యధికంగా విద్యుత్‌ను ఉపయోగించే వారికి తొలి ప్రాధాన్యం ఇస్తారు. రాయితీ విద్యుత్ వినియోగించుకునేవారికి, తక్కువ మొత్తంలో విద్యుత్ బిల్లు వచ్చేవారికి స్మార్ట్ మీటర్లు ఇవ్వరు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 15 లక్షల గృహ విద్యుత్ వినియోగదారులు ఉండగా వారిలో ఐదు లక్షల మందికి వీటిని అమరుస్తారని, మిగిలిన వారికి అవసరం ఉండదని ఈపీడీసీఎల్ అధికార వర్గాలు తెలిపాయి.



ప్రభుత్వ కార్యాలయంలో స్మార్ట్ మీటరు బిగిస్తున్న దృశ్యం

ఎందుకీ స్మార్ట్ మీటరు?

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్మార్ట్ మీటర్లను అమరుస్తున్నారు. వీటి వల్ల ఎక్కడ?, ఎంత? విద్యుత్ వినియోగిస్తున్నదీ ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు తెలుస్తుంది. అదేవిధంగా ఓల్టేజీ హెచ్చుతగ్గులు, విద్యుత్ సరఫరా ఉందా? లేదా? ట్రాన్స్‌ఫార్మర్‌పై పడుతున్న లోడ్ వంటి అంశాలన్నీ పంపిణీ సంస్థ అధికారులు కార్యాలయం నుంచి తెలుసుకోవచ్చు. స్మార్ట్ మీటరు ఏర్పాటుచేసుకున్న వారు దానిని మొబైల్‌లాగే ముందుగా డబ్బులు కట్టి రీచార్జి చేసుకోవలసి ఉంటుంది. ప్రస్తుతం విద్యుత్ వినియోగించిన తరువాత ప్రతి నెలా పది నుంచి పదిహేను రోజుల వ్యవధిలో బిల్లులు కట్టించుకుంటున్నారు. స్మార్ట్ మీటర్లు వచ్చాక..అలా కుదరదు. నెలకు ఎంత విద్యుత్ బిల్లు వస్తున్నదో సగటున అంచనా వేసి, ఆ మొత్తం ముందుగానే చెల్లించి మీటరును రీచార్జి చేసుకోవలసి ఉంటుంది. ఆ మొత్తం ఎంత అనేది వినియోగం బట్టి మారుతుంది. ఒక్కోసారి అధికంగా విద్యుత్‌ను ఉపయోగిస్తే రీచార్జి చేసుకున్న మొత్తం ముందుగానే అయిపోతుంది. అటువంటి సమయాల్లో వినియోగదారుల మొబైల్‌కు సమాచారం పంపిస్తారు. వినియోగించిన విద్యుత్, రీచార్జి చేసిన మొత్తం, ఇంకా ఎంత రీచార్జి చేసుకోవాలో తెలియజేస్తారు. దీనివల్ల విద్యుత్ పంపిణీ సంస్థలకు 100 శాతం బిల్లింగ్, పేమెంట్ జరుగుతుంది. విద్యుత్ పంపిణీ సంస్థలు నష్టాల నుంచి బయటపడడానికి ఈ విధానం ఉపయోగపడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ప్రభుత్వ కార్యాలయాల నుంచి వసూళ్లు

ప్రస్తుతం విద్యుత్ పంపిణీ సంస్థలకు వాణిజ్య, గృహ వినియోగదారుల నుంచి బిల్లుల వసూళ్లలో పెద్దగా సమస్యలు లేవు. 98 శాతం వసూలైపోతున్నాయి. కానీ ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలే బిల్లులు ఏళ్ల తరబడి కట్టడం లేదు. బకాయిలు కోట్ల రూపాయల్లో ఉన్నా పంపిణీ సంస్థలు చర్యలు చేపట్టలేకపోతున్నాయి. ఇతర వినియోగదారుల్లా సరఫరా నిలిపివేయడం, నోటీసులు ఇవ్వడం వంటివి చేయలేకపోతున్నాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఐటీ పార్కులో ఇన్నోవేషన్ సొసైటీ కలసి రూ.10 కోట్ల మొత్తం చెల్లించాల్సి ఉంది. అయినా వాటికి సరఫరా ఇస్తూనే ఉన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేస్తే ఇలాంటి బకాయిల బెడద ఉండదు. ఆయా సంస్థలు కూడా ముందుగానే వారి మీటర్లను రీచార్జి చేసుకోవలసి ఉంటుంది. ప్రతి కార్యాలయం అందుకు తగ్గ ఏర్పాట్లు చేసుకుంటుంది. అందుకే ముందుగా ప్రభుత్వ కార్యాలయాలకు వీటిని ఏర్పాటు చేస్తున్నట్టు విశాఖ సర్కిల్ ఎస్ఈ శ్యాంబాబు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.



అనకాపల్లి రైల్వేస్టేషన్ వద్ద సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్

అన్న క్యాంటీన్లకు బ్రేక్

ఉమ్మడి జిల్లాలో ఎన్నికల కోడ్ ఉన్నందున ప్రారంభం తాత్కాలికంగా వాయిదా

- హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు ఆహార సరఫరా బాధ్యత

విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఎన్నికల కోడ్ ఉండడంతో అన్న క్యాంటీన్ల ప్రారంభం తాత్కాలికంగా వాయిదా పడింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 15వ తేదీ నుంచి అన్న క్యాంటీన్లను అందుబాటులోకి తీసుకురావాలనుకున్నారు. అయితే ఈనెల 30న ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) ఎన్నిక జరగనున్నది. వచ్చే నెల ఆరో తేదీ వరకు కోడ్ అమలులో ఉండనున్నది. ఈ నేపథ్యంలో అన్న క్యాంటీన్ల ప్రారంభాన్ని వాయిదా వేశారు. కోడ్ ముగిసిన తరువాత క్యాంటీన్లు ప్రారంభించాలని నిర్ణయించారు. జీవీఎంసీ పరిధిలో భీమిలి నుంచి అనకాపల్లి వరకూ మొత్తం 25 క్యాంటీన్లు ప్రారంభించనున్నారు. నర్సీపట్నం, ఎలమంచిలి మునిసిపాలిటీల్లో ఒక్కొక్కటి ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే భవనాలు సిద్ధం చేశారు. క్యాంటీన్లకు భోజనం సరఫరా బాధ్యతను హైదరాబాద్‌కు చెందిన హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు అప్పగించారు. క్యాంటీన్లలో ఉదయం అల్పాహారం ... మిగతా 8వ పేజీలో



నక్కపల్లిలో వర్షం

జోరువాన

జిల్లాలోని పలు మండలాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మాకవరపాలెం, కోటవురట్ల, నక్కపల్లి, ఎలమంచిలిలో ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంది. సాయంత్రం 4 గంటల నుంచి ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. ఈ వర్షం వల్ల సరుగుడు, నువ్వు, పత్తి, కూరగాయాల పంటలకు మేలు జరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- నక్కపల్లి

దారితప్పుతున్న యువత

బెట్టింగ్, ఆన్‌లైన్‌లో పేకాట/గేమ్స్‌కు వ్యసనపరులుగా మారుతున్న విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు

- తక్కువ మొత్తంతో మొదలెట్టి... వేలు, లక్షల రూపాయలు పోగొట్టుకుంటున్న వైనం - 7లో

క్రైం... crime news

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కె.కోటపాడు, ఆగస్టు 10: మండలంలోని ఏ.కోడూరు శివారు జంగంబంద చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్టు గుర్తించామని ఏ.కోడూరు ఎస్‌ఐ జె.రమేష్ శనివారం తెలిపారు. మృతుడి వయసు 40 ఏళ్లు ఉండవచ్చని, శరీరం ఉబ్బిపోవడంతో గుర్తు పట్టని విధంగా ఉన్నట్టు చెప్పారు. తెలుపు, నలుపు రంగుల అడ్డగీతలతో ఉన్న టీ షర్టు, జీన్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. ఆ వ్యక్తి సంబంధీకులు ఉంటే ఏ.కోడూరు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

102 కిలోల గంజాయి స్వాధీనం

» ఐదుగురి అరెస్టు » రెండు వాహనాలు సీజ్


పట్టుబడిన గంజాయి, నిందితులతో అదనపు ఎస్పీ జగదీశ్ హడహళ్లి

చింతపల్లి, ఆగస్టు 10: ఒడిశా నుంచి కాకినాడకు గంజాయి తరలిస్తున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు రంపచోడవరం అదనపు ఎస్పీ జగదీశ్ హడహళ్లి తెలిపారు. నిందితుల నుంచి 102 కిలోల గంజాయి, రెండు వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. శనివారం అన్నవరం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒడిశా చిత్రకొండ బ్లాక్ పొదంజాలా గ్రామంలో జి.మాడుగుల మండలం ఏడుచావళ్ల గ్రామానికి చెందిన మర్రి శివరావు, చింతపల్లి మండలం లోతుగెడ్డ గ్రామ పంచాయతీకి చెందిన చిక్కం ప్రసాద్, బందబయలు గ్రామానికి చెందిన కుందేటి నాగేశ్వరరావు, చెరుకుంపాకలు గ్రామానికి చెందిన ఏశ్లెటి అర్జున్, దోమలగొంది గ్రామానికి చెందిన కొప్పోజి శ్రీనుబాబులు గంజాయిని కొనుగోలు చేశారన్నారు. గంజాయిని ప్యాకింగ్ చేసుకుని రాళ్లగెడ్డ మార్గంలో కాకినాడ తరలించేందుకు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. శుక్రవారం ఉదయం ఒకరు ద్విచక్రవాహనంలో పైలెట్‌గా ముందుగా ప్రయాణిస్తుండగా వెనుక ఆటోలో గంజాయిని తరలిస్తున్నారన్నారు. అన్నవరం పోలీసులకు వచ్చిన పక్కా సమాచారం మేరకు లోతుగెడ్డ బ్రిడ్జి వద్ద ఉదయం నుంచి ఎస్‌ఐ రాజారావు, పోలీసులు వాహన తనిఖీలు ప్రారంభించారని చెప్పారు. మధ్యాహ్నం 11 గంటలకు ఓ ద్విచక్రవాహనం, ఆటో లోతుగెడ్డ బ్రిడ్జి వద్దకు వచ్చి పోలీసులను గమనించి వెనక్కి వెళ్లిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు అప్రమత్తమైన పట్టుకున్నారన్నారు. ఆటోను తనిఖీ చేయగా 102 కిలోల గంజాయి బయటపడిందని, ఐదుగురు నిందితులను అరెస్టు చేసి గంజాయి, ద్విచక్రవాహనం, ఆటో, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ సమావేశంలో చింతపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రమేష్, ఎస్‌ఐ రాజారావు పాల్గొన్నారు.

మూడు కిలోల గంజాయి స్వాధీనం

» ముగ్గురి అరెస్టు

చింతపల్లి, ఆగస్టు 10: మండలంలో మూడు కిలోల గంజాయితో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్‌ఐ ఎం. వెంకటరమణ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా కృష్ణా జిల్లా పెనుమలూరు గ్రామానికి చెందిన తిరుమలకొండ నరసింహరావు, గల్లా రామేశ్, వేముల బాలు ఒక బ్యాగ్‌లో గంజాయి తరలిస్తూ వాహన తనిఖీల్లో పట్టుబడ్డారన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేశామన్నారు.

గోవులను తరలిస్తున్న కంటైనర్ పట్టివేత

» 52 పశువులు స్వాధీనం » ముగ్గురి అరెస్టు


కంటెయినర్‌లో తరలిస్తున్న గోవులు

ఎలమంచిలి, ఆగస్టు 10: స్థానిక జాతీయ రహదారిపై శనివారం ఉదయం గోవులను తరలిస్తున్న కంటైనర్‌ను పట్టుకున్నామని, ఈ సందర్భంగా ముగ్గురిని అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్‌ఐ కె.సావిత్రి తెలిపారు. విజయనగరం జిల్లా మానాపురం సంత నుంచి 52 ఎద్దులను కొనుగోలు చేసి, కంటెయినర్‌లో కేరళలోని పాలక్కాడ్ ప్రాంతానికి అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్టు చెప్పారు. నిబంధనలు పాటించకుండా అక్రమంగా ఎద్దులను తరలిస్తున్న నక్కపల్లి మండలం దేవవరం గ్రామానికి చెందిన చొప్పా నూకరాజు, కేరళ రాష్ట్రానికి చెందిన షిజు, విష్ణులను అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ సావిత్రి తెలిపారు. పట్టుబడిన ఎద్దులను వెటర్నరీ వైద్యుల పరీక్షలు అనంతరం సంరక్షణ ప్రాంతానికి తరలించనున్నట్టు ఆమె తెలిపారు.

'నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలి'

రోలుగుంట, ఆగస్టు 10: ఏజెన్సీని ఆనుకొని రోలుగుంట మండలంలోని పలు నాన్-షెడ్యూల్ గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలని గిరిజన సంఘం 5వ సాధన కమిటీ నాయకుడు కె.గోవిందరావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కొరుప్రోలులో గిరిజనులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ఆదివాసీ కొండదొర, నూకదొర, భగత, గదబ, మన్నె దొర తదితర తెగలు ఉన్నారన్నారు. ఏజెన్సీ ఆచారాలు, సంప్రదాయాలను ఆచరిస్తున్నారన్నారు. వీరికి 5వ షెడ్యూల్‌లో పొందుపరిచిన గిరిజన చట్టాలు, ఐటీడీఏ పథకాలు అందడం లేదన్నారు. ఈ విషయమై పలుమార్లు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు కూడా అందించినట్లు తెలిపారు.

విశాఖ, బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్ల పొడిగింపు

విశాఖపట్నం, ఆగస్టు 10: ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా విశాఖ, బెంగళూరు మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్ల సర్వీసులను మరో 15 ట్రిప్పుల వరకు పొడిగిస్తున్నట్టు సీనియర్ డీసీఎం కే సందీప్ తెలిపారు. 08543 నంబరు గల రైలు ఈనెల 18 నుంచి సెప్టెంబరు 24 వరకు ప్రతి ఆదివారం మధ్యాహ్నం 3.55 గంటలకు విశాఖలో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 12.30 గంటలకు ఎంఎస్ఎంవీ బెంగళూరు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08544 నంబరు గల రైలు ఈనెల 19 నుంచి సెప్టెంబరు 25 వరకు మధ్యాహ్నం 3.50 గంటలకు ఎస్ ఎంవీ బెంగళూరులో బయలుదేరి మర్నాడు మధ్యాహ్నం 1.30 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులు దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తణుకు, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పెట్టాయ్, కుప్పం, బంగారపేట, కృష్ణరాజపురం మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

పలాస, బ్రహ్మపూర్ రైళ్లు శ్రీకాకుళం రోడ్డు వరకే...

వాల్తేరు డివిజన్ పరిధిలోని పలాస, పూండి, నౌపడ, విజయనగరం సెక్షన్ల మధ్య ట్రాఫిక్ బ్లాక్ పనులు చేపట్టనున్నందున విశాఖ, పలాస మధ్య నడుస్తున్న మెము పాసింజర్ రైళ్లతోపాటు విశాఖ, బ్రహ్మపూర్ మధ్య రాకపోకలు సాగించే రైళ్ల గమ్యాలను శ్రీకాకుళం రోడ్డు వరకు కుదించామని సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. దీనిలో భాగంగా 07470, 07471 మెము రైళ్లు ఈనెల 12, 15, 17వ తేదీల్లో విశాఖ, శ్రీకాకుళం రోడ్డు స్టేషన్ల మధ్య, రాకపోకలు సాగిస్తాయన్నారు. శ్రీకాకుళం, పలాస మధ్య రాకపోకలు తాత్కాలికంగా నిలిపివేసినట్టు పేర్కొన్నారు. అలాగే, 08532 నంబరు గల రైలు ఈనెల 11న విశాఖ నుంచి శ్రీకాకుళం వరకు, 08531 నంబరు గల రైలు ఈనెల 12న శ్రీకాకుళం రోడ్డు నుంచి విశాఖకు నడుస్తుందని తెలిపారు. ఈ రైళ్లు శ్రీకాకుళం రోడ్డు, బ్రహ్మపూర్ మధ్య రాకపోకలు సాగించవని పేర్కొన్నారు. ఈ నెల 15న భువనేశ్వర్- ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ ఎక్స్ ప్రెస్ (12830), ఈనెల 17న భువనేశ్వర్ - తిరుపతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (22879) రైళ్లు భువనేశ్వర్‌లో గంట ఆలస్యంగా బయలుదేరేలా రైళ్లు రీ షెడ్యూల్ చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	78.00
లైవ్ ధర	98.00
విత్ స్కిన్	166.00
స్కిన్ లెస్	176.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

దారితప్పుతున్న యువత



బెట్టింగ్, ఆన్‌లైన్‌లో పేకాట/గేమ్స్‌కు వ్యసనపరులుగా మారుతున్న విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు

- » తక్కువ మొత్తంతో మొదలెట్టి...
- » వేలు, లక్షల రూపాయలు పోగొట్టుకుంటున్న వైనం
- » కుటుంబ సభ్యులకు తెలియకుండా బయట అప్పులు, అవి చెల్లించలేక తిప్పలు
- » అప్పుల ఊబిలో కూరుకుపోయి బయటకు రాలేని పరిస్థితి
- » ఆలస్యంగా గుర్తిస్తున్న తల్లిదండ్రులు
- » పిల్లల నడవడిక, ఖర్చులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని సూచిస్తున్న మానసిక వైద్యులు

(విశాఖపట్నం- ఆంధ్రజ్యోతి):

విశాఖలోని వెంకోజీపాలెం ప్రాంతానికి చెందిన ఓ యువకుడు బీటెక్ చదువుతున్నాడు. కొద్దిరోజులుగా ముభావంగా ఉండడంతోపాటు ఇంట్లో వాళ్లను తరచూ డబ్బులు అడగడం మొదలెట్టాడు. ఎందుకని అడిగితే సమాధానం చెప్పడం లేదు. గట్టిగా నిలదీస్తే చనిపోతానంటూ బెదిరించసాగాడు. తల్లిదండ్రులకు విషయం ఏమిటో అర్థం కాక మానసిక వైద్యుడి వద్దకు తీసుకువెళ్లారు. సదరు వైద్యుడు కౌన్సెలింగ్ నిర్వహించి మెల్లగా విషయాన్ని రాబట్టారు. తల్లిదండ్రులకు తెలియకుండా నాలుగు లక్షలు రూపాయలు అప్పు చేసి, ఆన్‌లైన్ పేకాటలో పోగొట్టినట్టు చెప్పాడు.

విజయనగరం జిల్లాకు చెందిన యువకుడు విశాఖలోని ఒక ప్రైవేటు వసతి గృహంలో ఉంటూ బీబీఏ చదువుతున్నాడు. కొద్దిరోజుల కిందట తల్లిదండ్రులకు ఫోన్ చేసి రూ.5 లక్షలు అర్జంట్‌గా కావాలని అడిగాడు. ఎందుకంటే సమాధానం చెప్పలేదు. డబ్బు పంపిస్తేనే మీకు కనిపిస్తానని హెచ్చరించడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే విశాఖకు చేరుకున్నారు. కుమారుడు ఆందోళనగా ఉన్నట్టు గుర్తించి మానసిక వైద్యుని వద్దకు తీసుకువెళ్లారు. అతడితో వైద్యుడు మాట్లాడగా బెట్టింగ్‌లో ఏడు లక్షల వరకు నష్టపోయినట్టు తెలిపాడు.

దేశ అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించాల్సిన యువకులు అడ్డదారులు తొక్కుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. బెట్టింగ్, పేకాట, ఆన్‌లైన్ గేమ్స్ వంటివి ఆడుతూ లక్షలాది రూపాయలను నష్టపోతున్నారు. కుటుంబ సభ్యులకు తెలియకుండా అప్పులు చేస్తూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. మరోవైపు డ్రగ్స్, మద్యం వంటి అలవాట్లకు బానిసలుగా మారుతూ జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్నారు. ఈ తరహా యువకుల సంఖ్య గత కొన్నాళ్లుగా పెరుగుతోంది. చెడు స్నేహాలు, అలవాట్లతో ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న వారిలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వరకూ ఉండడం గమనార్హం. నగర, గ్రామీణ ప్రాంతాలు అనే తేడా లేకుండా చిన్న వయసులోనే బెట్టింగ్, ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. మొదట తక్కువ మొత్తంతో ప్రారంభిస్తున్నారు. ఆ మొత్తాన్ని రాబట్టుకునే ప్రయత్నంలో వేలు, లక్షలు పోగొట్టుకుంటున్నారు. అందుకోసం దొరికిన చోటల్లా అప్పులు చేస్తున్నారు.

నిరుద్యోగి నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వరకు

ఈ జాబితాలో ప్రధానంగా విద్యార్థులు, నిరుద్యోగులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఉంటున్నారు. నగర పరిధి ఎంవీపీ కాలనీ ప్రాంతానికి చెందిన ఒక యువకుడు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అక్కడ పని చేస్తున్న ఒక స్నేహితుడి ద్వారా ట్రేడింగ్ చేయడం ప్రారంభించాడు. తొలుత లాభాలు రావడంతో ఎక్కువ మొత్తాన్ని పెట్టుబడి పెట్టాడు. పది రోజుల వ్యవధిలోనే సుమారు రూ.20 లక్షల వరకూ నష్టపోయాడు. క్రెడిట్ కార్డులు, ఆన్‌లైన్ యాప్‌లలో అప్పులు తీసుకుని మరీ పెట్టుబడి పెట్టిన సదరు యువకుడు...సమయానికి ఆయా సంస్థలకు డబ్బులు చెల్లించక పోవడంతో వేధింపులు పెరిగాయి. విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పలేక ఆత్మహత్య ప్రయత్నం చేశాడు. సకాలంలో స్నేహితులు గుర్తించి ఆస్పత్రిలో చేర్పించడంతో ప్రాణాపాయం తప్పింది. తల్లిదండ్రులు అక్కడి నుంచి తీసుకు వచ్చేశారు. అప్పులు చెల్లించి జాగ్రత్తగా ఉండాలని సూచించడంతోపాటు కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. విశాకలోని ప్రైవేటు కంపెనీలో పనిచేసే శ్రీకాకుళం జిల్లా యువకుడు రోజూ ఆన్‌లైన్‌లో పేకాట ఆడుతుండేవాడు. ఈ క్రమంలో అప్పుల పాలయ్యాడు. విషయం సోదరుడికి తెలియడంతో వచ్చి ఇంటికి తీసుకువెళ్లిపోయారు. అప్పటికే మూడు లక్షల రూపాయలు అప్పు చేసినట్టు తేలింది. దీంతో కుటుంబ సభ్యులు అప్పు చేసి మరీ ఆ అప్పులు తీర్చారు.

పాన్‌కార్డ్, ఆధార్ కార్డుతో అప్పులు

అప్పులు ఇచ్చేందుకు అనేక రకాల యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. పాన్‌కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ నంబర్ ఉంటే చాలు అప్పులు ఇస్తున్నారు. అయితే, భారీమొత్తంలో వడ్డీలు వసూలు చేస్తున్నారు. ఈ తరహా యాప్‌లు, కొందరు అప్పులు క్లియర్ చేసినా వారిని వేధింపులకు గురి చేస్తున్నాయి. ఇదిలావుండగా సులభంగా అప్పులు దొరుకుతుండడంతో ఇంట్లో తెలియకుండానే చాలామంది ఈ తరహా దురలవాట్లకు బానిసలుగా మారుతున్నారు. ఈ అప్పులు భవిష్యత్తులో వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తాయన్న విషయాన్ని గ్రహించడం లేదు.

ఆర్థిక అవసరాలపై దృష్టి అవసరం

పిల్లల ఖర్చుపై తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉంచాలి. అప్పుడే ఈ తరహా వ్యసనాలకు ప్రాథమిక దశలోనే అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఉంటుంది. ఖరీదైన వస్తువులు కొనుగోలు చేయడం, ఇంట్లో అవసరాలను తీర్చే పనులు చేయడం, ఫీజులు, ఇతర అవసరాలకు డబ్బులు అడగకపోవడం, కొన్నిసార్లు అవసరానికి మించి డబ్బులు అడగడం, గంటల తరబడి ఫోన్ పట్టుకుని ఉండడం, ఒంటరిగా ఉండేందుకు యత్నించడం వంటివి చేస్తే తల్లిదండ్రులు అప్రమత్తం కావాలని మానసిక వైద్యులు సూచిస్తున్నారు. కొన్నిసార్లు బంధువుల వద్ద కూడా అప్పులు చేస్తుంటారు. ప్రాథమిక దశలో గుర్తిస్తే వేగంగా వాటి నుంచి దూరంగా ఉండేలా చేయవచ్చునని చెబుతున్నారు. ఆలస్యం అయితే ఆర్థికంగా తీవ్రస్థాయిలో నష్టపోవడంతోపాటు కొన్నిసార్లు పిల్లల ప్రాణాలు కోల్పోవచ్చునని చెబుతున్నారు.

పిల్లల ఆర్థిక అవసరాలను నిశితంగా గమనించాలి

గతంతో పోలిస్తే పిల్లలు వ్యవహారశైలిలో పూర్తిగా మార్పు వచ్చింది. కుటుంబ పరిస్థితి, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ఆడంబరాలకు పోతున్నారు. అదే ప్రమాదానికి హేతువుగా మారుతోంది. పెద్దింటి పిల్లలతో సమానంగా బతకాలనే ఆలోచనలో నుంచి పుట్టుకు వస్తున్నవే ఈ తరహా దురలవాట్లు. ఎవరో ఆడుతున్నారని వీళ్లు నేర్చుకుంటున్నారు. డబ్బులు లేకపోతే అప్పులు చేస్తున్నారు. కొందరు దొంగతనాలకు పాల్పడుతున్నారు. కొంత మంది తల్లిదండ్రులు కూడా పిల్లలు ఆనందంగా ఉండాలని ఆర్థిక పరి స్థితులకు మించి వారి అవసరాలను తీరుస్తున్నారు. వేలాది రూపాయల ఫోన్లు, బైక్‌లు కొనిస్తున్నారు. ఇవి దురలవాట్ల వైపు పిల్లలు మొగ్గేలా చేస్తున్నాయి. తల్లిదండ్రులు తమ అవసరాలకు డబ్బులు ఇవ్వకపోతే కొందరు పిల్లలు అప్పులు, రాత్రివేళ దొంగతనాలకు పాల్పడుతు న్నారు. కొద్దిరోజుల కిందట హైవేపై దొంగతనాలకు పాల్పడుతున్న 15 మందిని పట్టుకున్నారు. వీరంతా చదువుకుంటున్నవాళ్లే. దొంగతనాలు చేయ డానికి కారణాలు తెలుసుకుంటే ఆన్‌లైన్ గేమ్స్, ఖరీదైన బైక్స్ మెయింటెనెన్స్ కోసం అని చెప్పారు. ఇటువంటి వ్యవహారాల్లో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. పిల్లలకు మోరల్ వాల్యూస్ చెప్పాలి. ఆర్థిక స్థితిగతులు, తమ కుటుంబ పరిస్థితులు వివరించాలి. మత్తు పదార్థాలు, ఇతర దురలవాట్లు వల్ల కలిగే అనర్థాలను చిన్న వయసులోనే తెలియజేయాలి. - **ప్రొఫెసర్ ఎంవీఆర్ రాజు**, ఏయూ సైకాలజీ విభాగాధిపతి

ఎమ్మెల్సీపై తేల్చని కూటమి

- » నేడు లేదా రేపు ఆరుగురు సభ్యుల కమిటీ సమావేశం
- » వైసీపీ అభ్యర్థి బొత్స నామినేషన్ రేపు
- » ఓటు కోసం వైసీపీ ఎంపీ, ఎమ్మెల్సీల దరఖాస్తు



విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ (స్థానిక సంస్థల కోటా) ఎన్నికల్లో పోటీ/అభ్యర్థి ఎంపికపై కూటమి నేతలు ఇంకా ఒక నిర్ణయానికి రాలేదు. ఈ విషయమై ముఖ్యమంత్రి నియమించిన ఆరుగురి సభ్యుల కమిటీ శనివారం విజయవాడలో భేటీ కావల్సి ఉంది. అయితే సభ్యుల్లో ఇద్దరు, ముగ్గురు అందుబాటులో లేకపోవడంతో ఆదివారం లేదా సోమవారం సమావేశం అయ్యే అవకాశం ఉంది. ఇదిలావుండగా వైసీపీ అభ్యర్థిగా బొత్స సత్యనారాయణ సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. అదేరోజు షైదాన ప్రాంతానికి చెందిన వైసీపీ జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను క్యాంపునకు తీసుకువెళతారని చెబుతున్నారు. నామినేషన్ల దాఖలుకు ఈనెల 13వ తేదీతో గడువు ముగుస్తోంది. అందువల్ల కూటమి పోటీ చేయదలచుకుంటే అభ్యర్థి పేరును సోమ, మంగళవారాల్లో ఖరారు చేయాల్సి ఉంటుంది. కాగా ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి విడుదల చేసిన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, కొత్త ఓటర్ల చేరికలకు గడువు ముగిసింది. చివరిరోజు వైసీపీ నుంచి రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, వరుదు కల్యాణిలు ఓటర్లుగా నమోదుకు దరఖాస్తు చేశారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం

» మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు


సమావేశంలో పాల్గొన్న పెంటారావు

కొత్తూరు, ఆగస్టు 10: ఎస్సీ వర్గీకరణను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకొని రాజ్యాంగాన్ని కాపాడుకుంటామని మాల మహానాడు రాష్ట్ర అధ్య క్షుడు పాల్తేటి పెంటారావు అన్నారు. శనివారం అనకాపల్లి పట్టణంలోని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక జిల్లా స్థాయి ప్రతినిధులు సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ అంతం.. మాలల పంతం నినాదంతో ముందుకు వెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తామని, అవసరమైతే వర్గీకరణపై ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా అంబేద్కర్ ఇండియన్ మిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి టీటీ.అప్పారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.దేవుడు, గొంది అప్పారావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు బోగేష్, కన్వీనర్ శివ, కో-కన్వీనర్లు ప్రకాష్, శేఖర్, రెల్లి శ్రీను, నూకేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం, ప్యాకేజీ ఇచ్చిన తర్వాతే పనులు చేపట్టాలి

» కారిడార్ నిర్వాసిత రైతుల డిమాండ్


చందనాడలో విలేకరులతో మాట్లాడుతున్న కారిడార్ రైతులు

నక్కపల్లి, ఆగస్టు 10: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన తమకు పూర్తిస్థాయిలో పరిహారం, ప్యాకేజీ ఇచ్చిన తర్వాతే పనులు ప్రారంభించాలని నిర్వాసిత రైతులు స్పష్టం చేశారు. శనివారం మండలంలోని చందనాడ తుఫాన్ భవనంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారిడార్ కోసం భూసేకరణ చేసిన సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఇళ్లు కోల్పోతున్నవారికి, 18 ఏళ్లు వయసు నిండిన వారికి రూ 25 లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. దళితుల గుల్లబట్టీలు, డి.పట్టా భూములను సాగుచేసుకున్న వారికి కూడా పరిహారం ఇవ్వాలన్నారు. మత్స్యకారుల జీవనోపాధి కోసం ఫిషింగ్ జెట్టీ నిర్మించాలన్నారు. రైతులకు వైసీపీ నేత వీసం రామకృష్ణ, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు, సర్పంచ్ తళ్లా రోహిణి భార్గవ్ సంఘీభావం ప్రకటించారు.

'ఒకటో తేదీనే పెన్షన్ ఇవ్వాలి'

» ప్రభుత్వ పింఛన్‌దారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డాది జగన్నాథరావు

నర్సీపట్నం, ఆగస్టు 10 : ప్రతి నెలా ఒకటో తేదీనే పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వ పింఛన్‌దారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డాది జగన్నాథరావు డిమాండ్ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ పీఆర్సీ, డీఆర్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. పెన్షన్‌దారులకు నగదు రహిత వైద్యం ఈహెచ్ఎస్‌పై అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతీ తాలూకా ముఖ్య కేంద్రంలో పెన్షనర్స్ అసోసియేషన్‌కి భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్రే గజ్జాలమ్మ, డీడీ ప్రసాదరావు, పి.కృష్ణమూర్తి, ఎం.అప్పలనాయుడు, సీహెచ్ సోమేశ్వరరావు, ఎస్‌టీఐ మేనేజర్ జేవీ రాఘవరావు పాల్గొన్నారు.

ఏయూ మాజీ ఓఎస్‌డీ సిత్రాలు

- » రాజీనామా చేసినా ఇప్పటికీ అదే హోదాలో కాన్ఫరెన్స్‌లకు వెళుతున్న ప్రొఫెసర్ కృష్ణమోహన్
- » గత నెలలో శ్రీలంక సదస్సుకు హాజరు
- » ఈ నెల 24, 25 తేదీల్లో బ్యాంకాక్‌లో జరిగే కాన్ఫరెన్స్‌కు ఆహ్వానం

విశాఖపట్నం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్, ఓఎస్‌డీ ప్రొఫెసర్ కృష్ణమోహన్ ఇప్పటికీ వర్సిటీకి చెందిన ఉన్నతాధికారిగానే పలు కాన్ఫరెన్స్‌లకు హాజరవుతుండడం చర్చనీయాంశంగా మారింది. గత నెలాఖరులో శ్రీలంకలో జరిగిన ఒక కాన్ఫరెన్స్‌కు ఏయూ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ) హోదాలో హాజరైన కృష్ణమోహన్...ఈ నెల 24, 25 తేదీల్లో బ్యాంకాక్‌లో నిర్వహిస్తున్న మరో కాన్ఫరెన్స్‌లో పాల్గొననున్నారు. సదరు కాన్ఫరెన్స్‌కు సంబంధించిన ఆహ్వానపత్రంలో ప్రొఫెసర్ కృష్ణమోహన్‌ను ఓఎస్‌డీగానే పేర్కొనడం గమనార్హం. దీనిపై వర్సిటీ ఉన్నతాధికారులను వివరణ కోరగా...ఆయన ఓఎస్‌డీ పదవికి రాజీనామా చేశారని, అవి ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం జరుగుతున్న సదస్సులు కావచ్చునని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రొఫెసర్ వడ్డాది కృష్ణమోహన్ మూడు పర్యాయాలు ఏయూ రిజిస్ట్రార్‌గా కొనసాగారు. నిబంధనలకు విరుద్ధంగా ఆయనకు గత వీసీ రెండు పర్యాయాలు రిజిస్ట్రార్‌గా అవకాశాన్ని కల్పించారు. రిజిస్ట్రార్ బాధ్యతలు నుంచి తప్పుకున్న తరువాత ఓఎస్‌డీ పేరుతో ప్రత్యేకంగా పోస్టును సృష్టించి ఆయన్ను నియమించారు.

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జూన్ నెలాఖరులో వీసీ, రిజిస్ట్రార్, ఓఎస్‌డీ పదవులకు ప్రసాదరెడ్డి, జేమ్స్ స్టీఫెన్, కృష్ణమోహన్ రాజీనామా చేశారు. అయితే, అంతర్జాతీయంగా పలు దేశాల్లో జరుగుతున్న కాన్ఫరెన్స్‌లకు మాత్రం కృష్ణమోహన్ ఇప్పటికీ ఓఎస్‌డీ హోదాలోనే హాజరవుతుండడంతో వర్సిటీలో చర్చనీయాంశంగా మారింది.

చిన్న సమస్యలపైనా అలక్ష్యం.. ప్రజల కష్టాలకు సాక్ష్యం

▸▸ కొన్నాళ్లుగా మొరపెట్టుకుంటున్న ఆయా గ్రామాల ప్రజలు ▸▸ చెవిన వేసుకోని గత వైసీపీ పాలకులు ▸▸ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించాలని వేడుకోలు

దళిత కాలనీల్లో సీసీ రోడ్లు ఛిద్రం





దుర్గాకాలనీలో పైప్‌లైన్ ఏర్పాటు పనుల్లో భాగంగా తవ్వి వదిలేసిన రోడ్డు (ఇన్ సెట్) వాల్వు ఏర్పాటు నిమిత్తం తవ్విన గొయ్యి

పాయకరావుపేట, ఆగస్టు 10 : పట్టణంలోని దళిత కాలనీల్లో ఇంటింటి కుళాయి పైప్‌లైన్ల నిమిత్తం తవ్విన సీసీ రోడ్లను రెండేళ్లుగా పునరుద్ధరించేవారు లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా దుర్గాకాలనీ, అంబేడ్కర్ కాలనీ, ఇందిరా కాలనీల్లో రెండేళ్ల క్రితం సీసీ రోడ్ల ఇరువైపులా తవ్వి పైప్‌లైన్లు వేసి ఇంటింటికీ కుళాయిలు వేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా దుర్గా కాలనీలోని ప్రధాన రహదారి ఇరువైపులా మూడు అడుగుల వెడల్పు సీసీ రోడ్డు తవ్వి వదిలేశారు. దీంతో అక్కడ తుప్పలు పెరిగిపోయి పాములు వంటివి సంచరిస్తున్నాయని అంతా ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు పైప్‌లైన్ల వాల్వులు ఏర్పాటుచేసిన చోట పెద్ద గోతులు తీసి అలాగే వదిలేయడంతో వాహనదారులు తరచూ చిన్నచిన్న ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే, పలుచోట్ల పైప్‌లైన్లు మురికి కాలువల్లో ఏర్పాటు చేయడంతో పైప్‌లైన్‌కు లీకు ఏర్పడితే మురుగు అందులో కలిసే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తవ్వి వదిలేసిన సీసీ రోడ్లను పునరుద్ధరించడంతో పాటు మురుగు కాలువల్లో వేసిన పైప్‌లైన్లను కాలువల పక్క నుంచి వేయాలని ఆయా ప్రాంతాల ప్రజలతో పాటు ఎంపీటీసీ సభ్యుడు కె.సత్తిబాబు కోరారు.

రోడ్డు పక్క బావులతో భయం.. భయం..



ఉప్పవరం రోడ్డుకు సమీపంలో ఉన్న ప్రమాదకర బావి

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని పలుచోట్ల పాడుబడిన బావులు భయపెడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఎవరు ప్రమాదానికి గురవుతారోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. కొండకర్ల నుంచి చూచుకొండ వెళ్లే రహదారి ఉప్పవరం శివారులో రోడ్డుకు సమీపంలో ఇదే స్థితిలో ఓ బావి ఉంది. ఈ రహదారిలో పదికిపైగా ప్రమాదకర మలుపులు ఉన్నాయి. వీటికితోడు ఈ పాడుబడిన బావి మరింత ప్రమాదంగా కనిపిస్తోంది. ఈ నుయ్యికి ఉండే గట్టు కూలిపోవడంతో అటుగా వెళ్లేవారు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అందులో పడడం తథ్యమని అంటున్నారు. గతంలో మడుతూరు సమీపంలో ఇలాంటి పాడుబడ్డ బావిలో కారుపడి పలువురు గాయాలపాలైన సంఘటన కూడా ఉందని అంటున్నారు. మడుతూరు నుంచి తంతడి వరకూ రోడ్డుకు సమీపంలో సుమారు ఐదు వరకు పాడుబడిన ప్రమాదకర బావులు ఉన్నాయి. వీటిని తొలగించాలని గత కొన్నేళ్లుగా కోరుతున్నా పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.



సీతారాంపురంలో గెడ్డ కాలువపై కల్వర్టు దుస్థితి

సీతారాంపురంలో ప్రమాద ఘంటిక

పాయకరావుపేట రూరల్ : మండలంలోని సీతారాంపురంలోకి వెళ్లే రోడ్డులో ఉన్న గెడ్డ కాలువపై కల్వర్టు కూలేందుకు సిద్ధంగా ఉంది. ఎన్నో ఏళ్ల క్రితం దీనిని నిర్మించడంతో నేడు శిథిల స్థితికి చేరుకుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలోకి రాకపోకలు ఈ కల్వర్టు మీదుగానే సాగించాల్సి ఉంటుంది. భారీ వాహనాలు, ట్రాక్టర్లు ఈ కల్వర్టుపై ప్రయాణిస్తే కూలిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. ఇదే జరిగితే గ్రామంలోకి వెళ్లి వచ్చేందుకు ఇబ్బందులు తప్పవని వాపోతున్నారు. ఈ సమస్యను కొన్నేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకునేవారు కరువయ్యారని చెపుతున్నారు.

కలవరపెడుతున్న కల్వర్టు



ముత్యాలమ్మపాలేనికి వెళ్లే రహదారిలో రక్షణ గోడ లేని కల్వర్టు

పరవాడ : వాడచీపురుపల్లి నుంచి ముత్యాలమ్మపాలేనికి వెళ్లే ప్రధాన రహదారిలోని స్థానిక ముత్యాలమ్మతల్లి ఆలయ సమీపంలో ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. ఇరువైపులా రక్షణ గోడలు పాడవ్వడంతో అటుగా రాకపోకలు సాగించేవారు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ముత్యాలమ్మపాలెం తీరానికి వెళ్లే పర్యాటకులతో పాటు పరిసర గ్రామాల ప్రజల రాకపోకలతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో ఇక్కడ తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో ప్రయాణం మరింత ప్రమాదకరంగా మారిందని చెబుతున్నారు.

జాజులవానిపాలెంలో శిథిలావస్థలో వాటర్ ట్యాంకు



శిథిల స్థితిలో ఉన్న రక్షిత మంచినీటి పథకం ట్యాంకు

పరవాడ: జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెం శివారు జాజులవానిపాలెంలో రక్షిత మంచినీటి పథకం ట్యాంకు శిథిలావస్థకు చేరుకుంది. జీవీఎంసీలో ఈ గ్రామం విలీనం కాకముందు సుమారు ఇరవై ఏళ్ల క్రితం మండల పరిషత్ నిధులతో ఈ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం శిథిల దశకు చేరుకుంది. మెట్లు దెబ్బతినడంతో పాటు పై నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. గోడలు బీటలు వారడంతో పాటు ట్యాంకు కింద భాగంలో గల తలుపులు చెదల పట్టాయి. నిర్వహణ పనులు సక్రమంగా లేకపోవడం వల్లే ఈ దుస్థితికి చేరిందని స్థానికులు వాపోతున్నారు.

సాదాసీదాగా అనకాపల్లి మండల సమావేశం

▸▸ ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రధాన సమస్యలపైనే చర్చ



సమావేశంలో సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీపీ సూరిబాబు

తుమ్మపాల, ఆగస్టు 10 : అనకాపల్లి మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉండడంతో ప్రధాన సమస్యలు మినహా, మిగతా అంశాలపై చర్చించ లేదు. ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన శనివారం ఉదయం ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ప్రారంభమైంది. వైద్య ఆరోగ్యశాఖ ద్వారా అందిస్తున్న సేవలను తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ నాగజగదీశ్వరి వివరించారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. తాగునీటి సరఫరాకు ఎటువంటి ఆటంకాలు లేకుండా జాగ్రత్తలు వహిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాస్ తెలిపారు. జల్‌జీవన్ మిషన్ పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతలపై ఆశాఖ అధికారులను పలువురు ప్రజాప్రతినిధులు నిలదీశారు. గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. అధికారులు సైతం ఇందుకు చొరవ చూపాలని సూచించారు. తొలుత ఇటీవల మృతి చెందిన మారేడుపూడి ఎంపీటీసీ ఈగల రామునాయుడుకు సభ్యులంతా సంతాపం ప్రకటించారు. ఈ సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు అధికారులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీల్లో పాల్గొన్న న్యాయవాదులు

కొత్తూరు, ఆగస్టు 10 : ఇక్కడి ఏఎంఏఎల్ కళాశాల క్రీడా మైదానంలో అనకాపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటైన ఈ పోటీల్లో న్యాయవాదులు చక్కని ఆటతీరును ప్రదర్శించారు. న్యాయమూర్తులు రమేష్, విజయలక్ష్మి హాజరై న్యాయవాదులను అభినందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జె.వి.ఎస్.కుమార్, దుర్గారావు, స్పోర్ట్స్ సెక్రటరీ మోహన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

భారత హాకీ జట్టుకు పతకంపై సంబరాలు



నక్కపల్లిలో సంబరాలు జరుపుకుంటున్న హాకీ క్రీడాకారులు

నక్కపల్లి, ఆగస్టు 10 : పారిస్ ఒలింపిక్స్‌లో భారత హాకీ జట్టు స్పెయిన్ జట్టును ఓడించి, కాంస్య పతకం సాధించడం పట్ల నక్కపల్లిలో బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ క్రీడాకారులు శనివారం సంబరాలు జరుపుకున్నారు. హాకీ క్లబ్ వ్యవస్థాపకులు బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ ఆధ్వర్యంలో త్రివర్ణ పతాకాన్ని చేతబట్టి హాకీ గ్రౌండ్ నుంచి హైవే మీదుగా విజయోత్సవ ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జాతీయ హాకీ క్రీడాకారుడు గాజుల రామచంద్రరావు, కోచ్ రాంబాబు, రజిత్, నానాజీ తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలి'



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

కొత్తూరు, ఆగస్టు 10 : ప్రతి ఇంటిపై ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రతి కార్యకర్త తన సొంత డబ్బులతో జాతీయ జెండాను ఇంటిపై ఎగురవేయాలన్నారు. తల్లి కొరకు ఒక మొక్క పథకంలో భాగంగా ప్రతి నాయకుడు, కార్యకర్త మొక్క నాటి దాని సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం మహిళా మోర్చ నాయకురాలు ఉమా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రెడ్డిని సన్మానించారు. పార్టీ జిల్లా ఇన్ చార్జి కర్రి చిట్టిబాబు, బీజేపీ నేతలు పొన్నగంటి అప్పారావు, పుట్ట గంగయ్య, వర్మ, కర్రి రామకృష్ణ, ఆరుగుళ్ల కొండబాబు, పోలమరశెట్టి నాగేశ్వరరావు, ముత్యాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లకు బ్రేక్

... 5వ పేజీ తరువాయి

మధ్యాహ్నం, రాత్రి భోజనం రూ.5కే అందించనున్నారు. భోజనం తయారీ ప్రస్తుతానికి కంచరపాలెంలోని అక్షయపాత్ర ఫౌండేషన్‌కు చెందిన సెంట్రల్ కిచెన్‌లో చేపడతారు. తరువాత మాధవధార, బోయపాలెంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సొంతంగా కిచెన్లు సమకూర్చుకోనున్నది.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

... 5వ పేజీ తరువాయి

చెందిన దాకారపు రాములు(48) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉపమాక శివారు కొండవెనుక పాలెం గ్రామంలో నిర్మాణంలో వున్న ఒక ఇంటికి వైరింగ్ చేస్తున్న సమయంలో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. అతడిని నక్కపల్లి ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. ఈ రెండు సంఘటనలతో ఎస్.నర్సాపురం, చినదొడ్డిగల్లు గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. వీటిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

మూడు మండలాల్లో వర్షం



కోటవురట్లలో వర్షం కురుస్తున్న దృశ్యం

ఎలమంచిలి/నక్కపల్లి/ కోటవురట్ల, ఆగస్టు 10 : వాతావరణంలో మార్పుల కారణంగా శనివారం పలు మండలాల్లో వర్షం కురిసింది. ఉదయం నక్కపల్లి మండలంలో వర్షం కురిసిన తరువాత ఎండ తీవ్రత కొనసాగడంతో జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆ తరువాత సాయంత్రం ఐదు గంటలకు జానకయ్యపేట, సీహెచ్ఎల్ పురం, తీనార్ల, ఉపమాక, నక్కపల్లి, కాగిత, చందనాడ, రాజయ్యపేట తదితర గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. దీంతో పంట పొలాల్లో నీరు చేరింది. అలాగే, ఎలమంచిలిలో ఉదయం నుంచి వేసవిని తలపించేలా భానుడు ప్రతాపాన్ని చూపాడు. దీంతో జనం బెంబేలెత్తిపోయారు. సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా మార్పు చోటు చేసుకుని ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. అనంతరం వాతావరణం చల్లబడడంతో అంతా ఉపశమనం పొందారు. అదేవిధంగా కోటవురట్ల మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ మండినప్పటికీ సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో ఆకాశం మేఘావృతమై కుండపోతగా వర్షం పడడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఈ వర్షం సరుగుడు, నువ్వు, పత్తి, కూరగాయాల పంటలకు మేలు చేస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

డైట్‌లో ఘనంగా హర్‌ఘర్ తిరంగా



జాతీయ జెండాలతో చైర్మన్, వివిధ విభాగాధిపతులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 10 : స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని డైట్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ కోరారు. శనివారం కళాశాలలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో మాట్లాడారు. ఇంటిపై ఎగురవేసిన జెండాతో సెల్ఫీ తీసుకుని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

విద్య అందరికీ అందుబాటులో ఉండాలి

▸▸ యూటీఎఫ్ ప్రతినిధి చినబ్బాయి



వేడుకల్లో మాట్లాడుతున్న గొంది చినబ్బాయి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 10 : విద్య అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయి కోరారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఇక్కడ ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో విద్యారంగం ఒక ప్రయోగశాలగా మారిందని వాపోయారు. ప్రభుత్వం మారుతున్న ప్రతిసారీ విద్యారంగంలో విధానాలు మారిపోతున్నాయన్నారు. విద్యా విధానంలో కామన్ సిలబస్ తేవాలని కోరారు. ప్రైవేటు విద్యారంగంలో ఫీజులు విపరీతంగా పెరిగాయని, సామాన్య ప్రజలకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారిందని ఆరోపించారు. అంతకుముందు ఫెడరేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు నెల్లి సుబ్బారావు ఇక్కడి సీఐటీయూ కార్యాలయం ఎదుట పతాకాన్ని ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీలక్ష్మి, కోశాధికారి జోగా రాజేష్, కార్యదర్శులు రమేష్‌బాబు, శేషుబాబు, ప్రతినిధులు ఎల్లయ్యబాబు, ఎంవీ అప్పారావు, రాజునాయుడు, సతీష్, శాంతి, కామరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులను ఫుడ్ ప్రాసెసింగ్ చేస్తే లాభాలు



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

పాయకరావుపేట, ఆగస్టు 10 : వ్యవసాయ ఉత్పత్తులకు ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా విలువ జోడించి విక్రయిస్తే అధిక లాభాలు పొందవచ్చునని తాండవ వాలీ ఉద్యానవన, వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం సీఈవో జీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఇక్కడి సంఘం కార్యాలయ ఆవరణలో శనివారం మహిళా రైతులకు వ్యవసాయ ఉత్పత్తులు- విలువ జోడింపుపై ఏర్పాటైన శిక్షణ శిబిరంలో మాట్లాడారు. ఈ ప్రాంతంలో రైతులు పండించే వరి, కొబ్బరి, అరటి, మామిడి తదితర పంటలను నేరుగా అమ్ముకోకుండా ఫుడ్ ప్రాసెసింగ్ ద్వారా వివిధ రకాల ఉత్పత్తులుగా మార్చి విక్రయించడం వలన సత్ఫలితాలు ఉంటాయన్నారు. సంఘంలో సభ్యులుగా చేరిన రైతులు ప్రధానమంత్రి సూక్ష్మ, చిన్న తరహా ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా సబ్సిడీపై ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ జీవీవీపీఆర్ వర్మ, పోలినాటి సూరిబాబు, తాండవ పరీవాహక ప్రాంత గ్రామాలకు చెందిన మహిళా రైతులు పాల్గొన్నారు.

12 మద్యం బాటిళ్లతో మహిళపై కేసు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 10 : మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న మహిళను పట్టుకుని, కేసు నమోదు చేసినట్టు పట్టణ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ బి.రామకృష్ణ తెలిపారు. పరవాడ మండలం తాడి కాలనీకి చెందిన పితాని నీలమ్మ సంచితో శనివారం ఇక్కడి పెరుగుబజార్ జంక్షన్‌లో ఉండగా అనుమానం వచ్చి తనిఖీ చేశామన్నారు. అందులో 12 మద్యం బాటిళ్లు ఉండడంతో స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన

కశింకోట, ఆగస్టు 10 : మండల కేంద్రం కశింకోటలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో శనివారం క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు మహాత్మాగాంధీ క్యాన్సర్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్క్రీనింగ్ టెస్టులు జరిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కావ్యలక్ష్మి మహిళలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. స్కూల్ కరస్పాండెంట్ బత్తుల అనురాధ పాల్గొన్నారు.

'మాదిగల చలో హైదరాబాద్' పోస్టర్ల ఆవిష్కరణ

తుమ్మపాల, ఆగస్టు 10 : మాదిగల చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ కార్యనిర్వాహక జిల్లా అధ్యక్షుడు గుడివాడ సామ్రాట్‌కుమార్ కోరారు. శనివారం అనకాపల్లిలో జరిగిన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశంలో మాట్లాడారు. తొలుత 13న జరగనున్న చలో హైదరాబాద్ పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు కె.కనకేశ్వరరావు, కట్టమూరి మంగరాజు, చెవిటి కమల, సత్తిబాబు, రవిబాబు, అచ్చంనాయుడు పాల్గొన్నారు.

'సీజ్ చేసిన వాహనాలకు జరిమానా'

సబ్బవరం, ఆగస్టు 10 : రాయపుఅగ్రహారంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తూ పట్టుబడిన వాహనాలకు రూ.38,850 అపరాధ రుసుం విధించినట్టు మైనింగ్ శాఖ రాయల్టీ అధికారిణి స్వాతి తెలిపారు. సదరు గ్రామంలో శుక్రవారం ఎక్స్‌కవేటర్, ఐదు ట్రాక్టర్లను సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన విషయం తెలిసిందే.

రక్షిత మంచినీటితో వ్యాధులు దూరం

ఎస్.రాయవరం, ఆగస్టు 10 : పెనుగొల్లు పీహెచ్‌సీ పరిధి వమ్మవరంలో స్టాప్ డయేరియా, రక్షిత మంచినీటి వల్ల ప్రయోజనాలపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామ్‌నాయక్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున అంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యాధులు సోకకుండా సురక్షితమైన నీటిని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది షేక్ అమీర్ షాజిద్, పి.శ్రావణి, దాలియమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 10 : అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని అంగన్ వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగేషు ప్రభుత్వాన్ని కోరారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఐటీయూ ఆధ్వర్యంలో 42 రోజులు పాటు సమ్మె చేసిన అనుభవాల పుస్తకాన్ని శనివారం సీఐటీయూ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేషు మాట్లాడుతూ కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, గ్రాట్యూటీ కోసం 42 రోజులు పాటు సుదీర్ఘ కాలం సమ్మె చేశామన్నారు. తక్షణమే వేతనాలను పెంచి గ్రాట్యూటీ అమలు చేయాలని ఆమె కోరారు. సంఘ అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, అంజలి, తనూజ, భ్రమరాంబ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పరారీలో ఉన్న గంజాయి నిందితుడి అరెస్టు

కోటవురట్ల, ఆగస్టు 10 : గంజాయి రవాణా కేసులో నిందితుడిని మండలంలోని యండపల్లి వద్ద శనివారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ రమణయ్య తెలిపారు. 2022లో 455 కిలో గంజాయి రవాణా కేసులో అప్పట్లో ఐదుగురుని అరెస్టు చేయగా. ఒక వ్యక్తి పరారీ అయ్యాడు. ఈ కేసులో పరారీలో ఉన్న రోలుగుంట మండలం బెన్నభూపాలంపట్నం గ్రామానికి చెందిన చిటికెల గణేశ్వరరావును యండపల్లి వద్ద పట్టుకున్నట్టు ఆయన చెప్పారు. నిందితుడిని నర్సీపట్నం కోర్టుకు తరలించగా జడ్జి రిమాండ్ విధించారు.

'ఒకటి నుంచి విశాఖలో ఏఐటీయూసీ సమావేశాలు'



సమావేశాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసి ప్రతినిధులు

తుమ్మపాల, ఆగస్టు 10 : ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలను జయప్రదం చేయాలని రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు బూసి వెంకటరావు కోరారు. శనివారం అనకాపల్లిలో జరిగిన ఏఐటీయూసీ నాయకుల సమావేశంలో మాట్లాడారు. తొలుత సమావేశం పోస్టర్లను ఆవిష్కరించారు. వచ్చే ఒకటి నుంచి మూడో తేదీ వరకు విశాఖలోని గురజాడ కళాక్షేత్రంలో ఈ సమావేశాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్మికులతో పాటు వివిధ వర్గాల ప్రజల సమస్యలపై చర్చించనున్నామన్నారు. ఏఐటీయూసీ నాయకులు పెంటకోట సత్యనారాయణ, రాజాన దొరబాబు, వైఎన్ భద్రం, ఎం.అప్పలరాజు, కె.త్రినాథ్, ఆర్.అప్పలరాజు, వీరాచారి, పోతురాజు, నరాలశెట్టి సత్యనారాయణ, రమణ పాల్గొన్నారు.

'మదర్ చారిటబుల్ సేవలు అభినందనీయం'



కుట్టు శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందిస్తున్న చొక్కాకుల

సబ్బవరం, ఆగస్టు 10 : పదేళ్లుగా సబ్బవరం పరిసర మండలాల్లో మదర్ చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు అభినందనీయమని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు అన్నారు. ట్రస్టు పదో వార్షికోత్సవం సం దర్భంగా శనివారం ఇక్కడ ఏర్పాటైన కార్యక్రమంలో మాట్లాడారు. పేదల సేవలో ట్రస్టు తరిస్తూ ఆదర్శవంతమైన సేవలు అందిస్తోందన్నారు. ట్రస్టు వ్యవ స్థాపకులు సత్యగంగ రాజు మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో పదిహేను రకాల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. అనంతరం కుట్టు శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు, పేదలకు బియ్యం పంపిణీ చేశారు. సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, టీడీపీ రాష్ట్రవాణిజ్య విభాగం కార్యదర్శి భరణికాన బాబూ రావు, మాజీ సర్పంచ్ ధనిమిరెడ్డి శ్రీను, మహిళా నాయకు రాలు దెడ్డం పద్మావతి, ట్రస్టు డైరెక్టర్లు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

దాడుల సంస్కృతిని ఉపేక్షించేది లేదు

» చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

బుచ్చెయ్యపేట, ఆగస్టు 10 : భౌతిక దాడులను ఉపేక్షించేది లేదని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు హెచ్చరించారు. ఆయన శనివారం ఎల్.సింగవరంలో టీడీపీ కార్యకర్త వేపాడ మధును పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ భూ సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలి తప్ప భౌతిక దాడులకు దిగడం మంచిది కాదన్నారు. ఎల్.సింగవరం రెవెన్యూ పరిధిలో శుక్రవారం బంజర్ల భూమి వివాదంలో కొండెంపూడి గ్రామస్థులు ఎల్.సింగవరానికి చెందిన మధుపై దాడి చేయాడాన్ని ఆయన తప్పుపట్టారు. వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు సామాన్య రైతులను బెదిరించి ప్రభుత్వ భూములను బలవంతంగా గుంజుకోవడం వల్లే ఇప్పుడు భూ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని విమర్శించారు. ప్రస్తుతం ఆ భూములను కాపాడుకునే క్రమంలో వైసీపీ నేతలు ఇలా దాడులకు తెగబడుతున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. ఇలాంటివి సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, కూటమి నాయకులు దాడి సూర్యనాగేశ్వరరావు, ముచ్చకర్ల తాతయ్యలు, సాయం శేషు, దేవర అప్పారావు, దొండా శీను, తమరాన దాసు, దొండా సన్యాసిరావు, వీర్ల సురేష్, శరకాన బాబురావు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరిన యువకులు



కృష్ణ ఆధ్వర్యంలో జనసేనలో చేరిన యువత

కె.కోటపాడు, ఆగస్టు 10 : మండల కేంద్రం కె.కోటపాడుకు చెందిన పలువురు యువకులు శనివారం జనసేన పార్టీలో చేరారు. మాడుగుల నియోజకవర్గ ఇన్‌చార్జి రాయపురెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో గోపి నాగేశ్వరరావు, జి.రాజేష్, దొడ్డి మహేష్, వేగి ప్రకాష్, గౌరునాయుడు తదితరులు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కృష్ణ మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అంజిబాబు, త్రినాథ్, అచ్యుతరావు, అప్పలనాయుడు, రాజీ నారాయణమూర్తి, వేగి శివాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరించరూ..



వంకచెరువు వద్ద అలంకారప్రాయంగా డీపీ

బుచ్చెయ్యపేట, ఆగస్టు 10 : దిబ్బిడి వంక చెరువు వద్ద డీపీ నుంచి విద్యుత్ సరఫరా జరగకపోవడంతో సాగునీటికి ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పది రోజుల క్రితం విద్యుత్ లైన్‌పై కొమ్మలు తొలగించారు. ఈ క్రమంలో విద్యుత్ వైర్లకు ఉన్న కేశరాలు విరిగిపోవడంతో పది మోటార్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు మోటార్లు ద్వారా నీటి సరఫరా చేయాలి. అయితే విద్యుత్ సరఫరా కాకపోవడంతో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు సుతపల్లి సర్వేశ్వరరావు, ఆకుల ఈశ్వరరావు, జి.శ్రీనివాసరావు, గొంపా నాయుడు, అప్పలనాయుడు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖాధికారులు స్పందించి విద్యుత్ సరఫరాకు పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితం నాశనం : న్యాయవాది ప్రసాదరావు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాదరావు

మాడుగుల, ఆగస్టు 10 : గంజాయి, నాటుసారాకు దూరంగా ఉండడమే కాకుండా వాటి నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని స్థానిక న్యాయవాది శ్రీనాథ ప్రసాదరావు పేర్కొన్నారు. మండల లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం మాడుగుల గడబూరు గ్రామంలో గంజా, నాటుసారా నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు.

'చోద్యం' చూస్తున్నారా?

- అధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- నెలల తరబడి చెత్త తరలించని వైనం
- దుర్గంధంతో స్థానికుల ఇబ్బందులు
- అధికారుల తీరుపై స్థానికుల అసంతృప్తి



చోద్యం హైస్కూల్ రోడ్డులో చెత్తకుప్పలు



సచివాలయం సమీపంలో పరిస్థితి..

కృష్ణాదేవిపేట, జూలై 10 : గొలుగొండ మండలం చోద్యం పంచాయతీ వీధుల్లో ప్రధాన రహదారి పక్కన, సచివాలయ సమీపంలో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. గ్రామంలో నెలల తరబడి చెత్త తరలింపునకు చర్యలు తీసుకోకపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైందని స్థానికులు మండిపడుతున్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, పరిశుభ్రత పాటించాలన్న అధికారుల మాటలు అమలులో మాత్రం కనిపించడం లేదని విమర్శిస్తున్నారు. పరిశుభ్రతపై కేవలం అవగాహన సదస్సులు, ర్యాలీ చేయడం కాదని.. అమలులో చూపాలని వ్యాఖ్యానిస్తున్నారు. వర్షాలకు చెత్తకుప్పలు కుళ్లి దుర్వాసన వెలువడుతుండడంతో పరిసరాల్లో ఉండలేకపోతున్నామని వాపోతున్నారు. చెత్తకుప్పలపై ఈగలు, దోమలు ముసురుతూ అక్కడి పరిసరాలు అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. ఇక్కడి పాఠశాలలకు పరిసర గ్రామాలు లింగంపేట, గాదం పాలెం, విప్పలపాలెం తదితర గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్తకుప్పల వద్ద రాత్రి వేళల్లో కొందరు బహిర్భూమికి వెళ్ళడం, అందులో ఉన్న వ్యర్థాలను కుక్కలు రోడ్లపైకి తెచ్చి పడేస్తుండడంతో దుర్గంధం వెలువడుతోందని అంటున్నారు. దీనివల్ల ఏ రోగం వస్తుందోననే భయం కలుగుతోందని వాపోతున్నారు. గ్రామంలో చెత్త సంపద కేంద్రాలు ఉన్నప్పటికీ అవి ఉపయోగంలో లేకపోవడంతో రోడ్డుపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

జాతీయ దినోత్సవాల నిర్వహణకు నిధులు పెంపు హర్షణీయం

» ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీ చాంబర్ అధ్యక్షుడు ఎరుకునాయుడు



కె.కోటపాడు, ఆగస్టు 10 : పంచాయతీల్లో స్వాతంత్ర దిన వేడుకల నిర్వహణ ఖర్చును ప్రభుత్వంభారీగా పెంచిందని, దీనివల్ల పాఠశాల విద్యార్థులకు పంచాయతీల ద్వారా చక్కని బహుమతులు అందించవచ్చని ఉమ్మడి విశాఖ జిల్లాపంచాయతీ చాంబర్ అధ్యక్షుడు దాడి ఎరుకునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. గత 34 ఏళ్లుగా మేజర్ పంచాయతీలకు ఇప్పటి వరకు కేవలం రూ.250లు, మైనర్ పంచాయతీలకు వంద రూపాయలు నిర్వహణ ఖర్చు ఉండేదని తెలిపారు.

ప్రస్తుతం ప్రభుత్వం వంద శాతం పెంచుతూ 250 రూపాయలను 25 వేలు, వంద రూపాయలను పది వేలుకు పెంచారని అన్నారు. ఇటీవల పవన్‌కల్యాణ్‌ను సర్పంచులు కలిసినపుడు నిధులు కొరత వల్ల స్వాతంత్ర్య, గణతంత్ర వేడుకల నిర్వహణ కష్టంగా ఉందని తెలిపి నట్టు ఎరుకునాయుడు పేర్కొన్నా రు. ఈ నేపథ్యంలో తక్షణమే నిధుల పెంపు నిర్ణయం తీసుకోవ డం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, ఇతర క్రీడా పోటీలను నిర్వహించి బహుమతులు అందజేయడం, పారిశుధ్య కార్మికులను సత్కరించేందుకు ఈ నిధులను ఖర్చు చేస్తామని ఎరుకునాయుడు స్పష్టం చేశారు.

పరిశుభ్రతపై గ్రామీణుల్లో అవగాహన అవసరం : జస్టిస్ సూర్యకళ



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జడ్జి డా.సూర్యకళ

చీడికాడ, ఆగస్టు 10 : పరిశుభ్రతపై గ్రామీణుల్లో అవగాహన పెంచాలని చోడవరం అడిషనల్ సివిల్ జడ్జి డాక్టర్ బి.సూర్యకళ సూచించారు. మండలంలోని కోనాంలో శనివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరైనా అనారోగ్యానికి గురైతే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలన్నారు. ఈ శిబిరంలో చిన్నపిల్లల వైద్యనిపుణులు డా.నరేష్, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు సంతోష్, గైనకాలజిస్ట్ డా.కుసుమ, చీడికాడ పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్ కుమార్ వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో హెల్త్ సూపర్‌వైజర్ జి.వెంకటరావు, హెల్త్ అసిస్టెంట్ పెంటకోట పేరునాయుడు, చీడికాడ ఎస్‌ఐ బి.నారాయణరావు, కోనాం బాలుర హాస్టల్ వార్డెన్ చలుగు జగన్నాథం, ఏఎన్ఎం, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

విద్యుత్ వైర్లకు అడ్డు రావడంతో నరికివేత



నరికి పడేసిన భారీ కొమ్మలు

చీడికాడ, ఆగస్టు 10 : ఉపాధి పథకం, అటవీ, విద్యుత్ శాఖాధికారుల మధ్య సమన్వయ లోపం పచ్చని చెట్లకు ప్రతిబంధకంగా మారుతోంది. ఏటా రాష్ట్ర ప్రభుత్వం పిలుపుతో వేలాది మొక్కలు పెంచాలంటూ జిల్లా అధికారులు లక్ష్యం నిర్దేశించడంతో ఈ శాఖల అధికారులు ఎలాంటి ప్రణాళిక లేకుండా ఎక్కడపడితే అక్కడే మొక్కలు నాటుతారు. తీరా ఆ మొక్కలు చెట్లుగా పెరిగే సమయంలో విద్యుత్ తీగలకు ఇబ్బంది కలుగుతుందంటూ కొమ్మలు, కొన్ని చోట్ల చెట్లనే నరికి వేస్తున్నారు. దీనివల్ల ప్రజాధనం వృథా అవుతోందని పలువురు అంటున్నారు.

మండలంలోఅప్పలరాజుపురం నుంచి ఎల్బీ పట్నం వరకూ రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ వైర్ల కింద పెరుగుతున్న సుమారు 25 చెట్లను శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు నరికి వేయించారు. దీని చూసిన పలువురు మొక్కలు నాటినపుడు వైర్ల కింద నాటడం ఎందుకు? అవి పెరిగిన తరుణంలో నరకడమెందుకు అంటూ వ్యాఖ్యానించారు. ఎలాంటి ముందస్తు ప్రణాళిక లేకుండా పనులు చేపట్టడం వల్లే ప్రజాధనం వృథాఅవుతోందని అసంతృప్తి వ్యక్తం చేశారు.

దీనిపై ఉపాధి పథకం అధికారి ఈసీ రమేష్ మాట్లాడుతూ సుమారు ఎనిమిదేళ్ల పాటు పెరిగిన చెట్లను కనీసం తమ అనుమతి లేకుండా విద్యుత్ అధికారులు నరికివేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ ఏఈ నమ్మి వెంకటరావు వద్ద ప్రస్తావించగా విద్యుత్ వైర్లకు ఇబ్బందికరంగా మారడం వల్లే చెట్ల కొమ్మలు తొలగిస్తున్నామని చెప్పారు. చెట్లను పూర్తిగా నరికి వేయడం లేదని, అవి మళ్లీ చిగురించే విధంగా జాగ్రత్తలు తీసుకొని కొమ్మలు తీస్తున్నామని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణపై పునరాలోచన చేయాలి

అంబేడ్కర్ యువజన సేవా సంఘం డిమాండ్



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న సంఘ నేతలు

రావికమతం, ఆగస్టు 10 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు పునరాలోచన చేయాలని కోరుతూ మండలంలోని కొత్తకోటలో అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం నిరసన చేపట్టారు. స్థానిక బీఎన్ రోడ్డులో చేపట్టిన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు మల్లేటి రాజు, బుల్లి బాబు, పూడి దేవ, కాగిత గంగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. గతంలో సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పునే కాదని మరో ధర్మాసనం వర్గీకరణ చేసుకోవచ్చంటూ చెప్పటం వెనుక రాజకీయ ఒత్తిడులు ఉన్నాయని అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఏబీసీడీ వర్గీకరణ కారణంగా ఎస్సీ మాలలతో పాటు మరో 16 ఉప కులాలకు తీవ్రఅన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అంతకు ముందు భారీ స్థాయిలో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మూడు రోడ్డు కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు.

చోడవరంలో మానవతా సంస్థ సేవలు

» కార్యవర్గంలో స్థానిక నేతలు



సమావేశంలో పాల్గొన్న స్థానిక పెద్దలు

చోడవరం, ఆగస్టు 10 : అనాథ మృతదేహాలకు అంతిమ సంస్కారాలు నిర్వహించడం, శ్మశాన వాటికల్లో పరిశుభ్రతకు పని చేయడం వంటి కార్యక్రమా లు నిర్వహిస్తున్న మానవతా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు శనివారం పట్టణంలోని ఆదివాసీ, మండల వికలాంగుల సంక్షేమ సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వ్యాపారస్తులు, విద్యారంగ ప్రముఖులు పాల్గొని పట్టణంలో ఒక కార్యవర్గాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో చోడవరం, పరిసర ప్రాంతాల్లో మానవతా సంస్థల కార్యక్రమాన్ని కొనసాగించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ఏడమ్స్ వెంకటరావు, చేకూరి రాజు, డీఎస్ ప్రసాద్, పసుమర్తి మల్లిక్, శేషానందం చందు, ఉపాధ్యాయుల శ్రీనివాస్, మానవతా సంస్థ ప్రతినిధులు పెద్దిరెడ్డి ప్రసాద్, టెక్కలి రామకృష్ణ, వీరవెంకట సత్యనారాయణ, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వైద్య సేవలను వినియోగించుకోవాలి

మాడుగుల రూరల్, ఆగస్టు 10 : ఉచిత వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలని కేజేపురం భానోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ వ్యవస్థాపకుడు రాపేటి రామకొండారావు అన్నారు. ఈ సొసైటీ ఆధ్వర్యంలో పలుమార్లు సంగివలస అనీల్ నీరుకొండ ఆస్పత్రి సహకారంతో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. కళ్లు, చెవి, ముక్కు, గుండె, కిడ్నీ, మూలవ్యాధి, హెర్నియా పలు వ్యాధులకు పెద్దా, చిన్న ఎవరికైనా ఉచితంగా పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్సలు కూడా చేస్తున్నారన్నారు. ఈ నెల 14న ఆస్పత్రి సహకారంతో ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేసి మాడుగుల నుంచి ఉదయం 8 గంటలకు బయల్దేరి కేజేపురం వచ్చి అక్కడ నుంచి సంగివలస ఆస్పత్రికి రోగులను తీసుకెళతారని చెప్పారు. ఈ నెల 21, 28 తేదీల్లో కూడా మాడుగుల, వమ్మలి నుంచి బస్సు ఏర్పాటు చేసి తీసుకెళతారని వివరాలకు ఫోన్ : 9885650716లో సంప్రదించాలని కోరారు.

నేడు వాలాబులో వైద్య శిబిరం

దేవరాపల్లి, ఆగస్టు 10 : మండలంలోని వాలాబులో సంఘమిత్ర రూరల్ డవలప్ మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి శనివారం తెలిపారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించనున్న ఈ వైద్య శిబిరంలో చెవి, ముక్కు, గొంతు ప్రత్యేక వైద్యుడు బండారు రామచంద్రరావుతో పాటు పలువురు వైద్య నిపుణులు పాల్గొంటారన్నారు.

మాకవరపాలెంలో భారీ వర్షం



భారీగా కురుస్తున్న వర్షం

మాకవరపాలెం, ఆగస్టు 10 : మండలంలో భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం నుంచి ఎండ తీవ్రతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారు. ముఖ్యంగా గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు ఎండ తీవ్రతకు అలసటకు గురయ్యారు. అలాగే వరి నాట్లు వేసే కూలీలు ఎండ తీవ్రతతో చెట్ల నీడ పట్టారు. అయితే సాయంత్రం 4 గంటలకు ఆకాశంలో మేఘాలు కమ్మి భారీ వర్షం కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు. అలాగే ఇంతవరకు వరినాట్లు వేసిన పొలాలకు ఈ భారీ వర్షం ఎంతో ఉపయోగమని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణాదేవిపేటలో ఓ మోస్తరు వాన..

కృష్ణాదేవిపేట : గొలుగొండ మండలంలో గల ఏఎల్‌పురం, కొంగశింగి, సీహెచ్ నాగాపురం, పల్లావూరు, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, లింగంపేట తదితర గ్రామాల్లో శనివారం చిరుజల్లు పడింది. మూడు రోజులు ఎండలు మండుతున్న నేపథ్యంలో చిరుజల్లు ఉపశమనం ఇచ్చింది. గతంలో పడిన భారీ వర్షాలకు ఇప్పటికే రైతులు వరినాట్లు పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనకంగా పడడంతో రబీ, ఖరీఫ్ వరిసాగుకు ఇబ్బందులు ఉండవని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

గాడిన పడుతున్న గ్రామ పాలనా వ్యవస్థ

» జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు

రోలుగుంట, ఆగస్టు 10 : డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో పంచాయతీల పాలన వ్యవస్థ గాడిన పడుతుందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు పేర్కొన్నారు. స్వాతంత్ర్య వేడుకలకు పంచాయతీలకు నిధులు పెంచడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ శనివారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. రాజకీయాలకు అతీతంగా పవన్ తీసుకుంటున్న నిర్ణయాలు రాష్ట్ర అభివృద్ధిపై ఆశలు రేకిస్తున్నాయన్నారు. మండలంలోని అన్ని పంచాయతీల నుంచి జనసేన కార్యకర్తలు, నాయకులు ఈ స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జగన్నాథరావు మాస్టారుకు అవార్డు



కలెక్టర్ నుంచి జ్ఞాపిక అందుకొంటున్న జగన్నాథం

చీడికాడ, ఆగస్టు 10 : మండలంలోని కోనాం ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాల ఉపాధ్యాయుడు చలుగు జగన్నాథరావు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేతులమీదుగా మెమొంటో అందుకున్నా రు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మాడుగుల మండలం తాటిపర్తిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జగన్నాథరావు గిరిజన విద్యార్థులకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా అవార్డు ఇచ్చారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం - పంచాయితీరాజ్ శాఖ

రేఖా సంఖ్య: 199/2024/బి2 తే.25-07-2024ది

విషయము : గుత్తలు - అనకాపల్లి డివిజను - చీడికాడ మండలము, తురువోలు గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న 31 చెరువులలో చేపలు పెంపకము చేసి, చేపలు పట్టుకునే గుత్తహక్కు (2024-2025) 1434 ఫసలీ సంవత్సరమునకు బహిరంగ వేలం నిర్వహించి లీజుకు ఇచ్చుటకు - అఫ్‌సెట్ ప్రైస్ (మద్దతు ధర) నిర్ణయిస్తూ - ఉత్తర్వులు జారీచేయడమైనది.

సూచిక :
1. తరువోలు గ్రామ పంచాయితీ వారు తీర్మానం నెం.165/2024, తే.12-06-2024ది.
2. పంచాయతీ కార్యదర్శి, తురువోలు గ్రామ పంచాయితీ వారి రేఖా సంఖ్య 02/2024/గ్రా.అ. తే.05.07.2024ది.
3. విస్తరణాధికారి (పం.రా & గ్రా.అ) చీడికాడ వారి రేఖా సంఖ్య 11/2024, తే.05-07-2024ది.
4. జి.ఓ.ఎం.ఎస్.నెం.499/పి.అర్ & అర్.డి.(పంచాయితీ రాజ్ డిపార్టుమెంటు) తే.25-11-1998ది.

ఉత్తర్వులు : పై సూచికలను పురస్కరించుకొని చీడికాడ మండలము, తురువోలు గ్రామ పంచాయితీ తీర్మానము ప్రాప్తికి మరియు పంచాయతీ కార్యదర్శి, తురువోలు గ్రామ పంచాయితీ వారు మరియు విస్తరణాధికారి (పి.అర్&అర్.డి) చీడికాడ వారి సవివరమైన నివేదికలు మేరకు తురువోలు గ్రామపంచాయితీ పరిధిలో ఉన్న 31 చెరువులలో చేపలు పెంపకము చేసి, చేపలు పట్టుకునే గుత్తహక్కు (2024-25) 1434 ఫసలీ (01 సం.రము) కాలమునకు బహిరంగ వేలం నిర్వహించి, లీజుకు ఇచ్చుటకు ఈ దిగువ తెలిపిన విధముగా అప్‌సెట్ ప్రైస్ (మద్దతు ధర) నిర్ణయిస్తూ ఉత్తర్వులు జారీ చేయడమైనది.

సదరు వేలము పాటను పై 4వ సూచికలోని నిబంధనలు ప్రకారము స్థానిక మత్స్యకార సంఘము వారికి రిజిష్టర్ పోస్ట్ ద్వారా తెలియపరచి, నోటీసు అందిన 15 దినములలో వారి అంగీకారము తెలియపరచినచో వారికి లీజుకు ఇవ్వవలెను. అట్లుకాని పక్షములో విస్తరణాధికారి (పి.అర్&అర్.డి) చీడికాడ మండలము వారి సమక్షమున బహిరంగ వేలము నిర్వహించబడును.

వేలం పాట తేది : 12-08-2024న చీడికాడ మండలం, తురువోలు గ్రామ పంచాయితీ వద్ద ఉదయం 11.00 గం.లకు వేలంపాట జరుగును.

అంబేడ్కర్ ఆశయాలు ఆదర్శనీయం : రిటైర్డ్ జడ్జి నడుపూరి



రామకమతంలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సన్యాసిరావు తదితరులు

రావికమతం, ఆగస్టు 10 : విద్యార్థులు చక్కగా చదువుకుని అభివృద్ధిలోకి వచ్చి అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని చోడవరం అంబేడ్కర్ ట్రస్ట్ ఫౌండేషన్ చైర్మన్, రిటైర్డ్ సివిల్ జడ్జి నడుపూరి సన్యాసిరావు అన్నారు. శనివారం మండలంలోని రావికమతంలో సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కండెల్లి వెంకట్రావు, భూపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : పట్టణంలోని ప్రేమ సమాజంలోని విద్యార్థులు, వృద్ధులకు అంబేడ్కర్ ట్రస్ట్ సభ్యులు శనివారం పుస్తకాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ అంబేడ్కర్ భవన్ చైర్మన్ బొడ్డు కల్యాణరామ్, స్థానిక అంబేడ్కర్ ట్రస్ట్ చైర్మన్ నడుపూరు సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

... 5వ పేజీ తరువాయి

చెందిన దాకారపు రాములు(48) ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఉపమాక శివారు కొండవెనుక పాలెం గ్రామంలో నిర్మాణంలో వున్న ఒక ఇంటికి వైరింగ్ చేస్తున్న సమయంలో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. అతడిని నక్కపల్లి ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు. ఈ రెండు సంఘటనలతో ఎన్.నర్సాపురం, చినదొడ్డిగల్లు గ్రామాల్లో విషాదఛాయలు అలముకున్నాయి. వీటిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

అన్న క్యాంటీన్లకు బ్రేక్

... 5వ పేజీ తరువాయి

మధ్యాహ్నం, రాత్రి భోజనం రూ.5కే అందించనున్నారు. భోజనం తయారీ ప్రస్తుతానికి కంచరపాలెంలోని అక్షయపాత్ర ఫౌండేషన్‌కు చెందిన సెంట్రల్ కిచెన్‌లో చేపడతారు. తరువాత మాధవధార, బోయపాలెంలో హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ సొంతంగా కిచెన్లు సమకూర్చుకోనున్నది.

వసతి గృహాల్లో విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ



మందులు అందిస్తున్న వైద్యాధికారి ధనలక్ష్మి

రోలుగుంట, ఆగస్టు 10 : బీసీ వసతి గృహం, కేజీబీవీ విద్యాలయాల్లో విద్యార్థుల ఆరోగ్యాన్ని ఆరోగ్య శాఖ సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తుండాలని రోలుగుంట ఆరోగ్యం కేంద్రం వైద్యాధికారి ధనలక్ష్మి పేర్కొన్నారు. శనివారం ఆరోగ్య సిబ్బందితో కలిసి స్థానిక బీసీ హాస్టల్, కేజీబీవీ విద్యాలయాన్ని సందర్శించి వసతులను పరిశీలించారు. వారికి ఎలాంటి సౌకర్యాలు అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల ప్రబలే ప్రమాదం ఉన్నందున వారి ఆరోగ్యంపై తగిన పర్యవేక్షణ ఉండాలన్నారు. పలువురు విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించి, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాలయాలు, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాలకు సిమెంటు బెంచీల వితరణ



దేవరాపల్లి, ఆగస్టు 10 : మండలంలోని రైవాడలో మూడు ఆలయాలకు ఇద్దరు దాతలు సిమెంటు బల్లలు వితరణ చేశారు. రైవాడ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలిగా పని చేసిన వెంకట శ్రీదేవి, సుధాకరు దంపతులతో పాటు, ఇదే గ్రామానికి చెందిన కానిస్టేబుల్ కె.బాలరాజు వీటిని సమకూర్చారు. గ్రామంలో వరసిద్ధి హనుమాన్ ఆలయం, రైవాడ జలాశయానికి ఆనుకొని ఉన్న గ్రామదేవ త ఎరకాలమ్మ గుడి, ఆ పక్కనే ఉన్న షిర్డీ సాయిరాం ఆలయాల వద్ద సిమెంటు బల్లలు అమర్చారు.

తహసీల్దార్ కార్యాలయంలో 'నిఘా'పై నిర్లక్ష్యం



మరమ్మతుకు గురై పని చేయని సీసీ కెమెరా

మాకవరపాలెం, ఆగస్టు 10 : మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న సీసీ కెమెరా వృథాగా పడి ఉంది. ఇక్కడ 2010లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా కొన్నాళ్లకు మరమ్మతుకు గురవగా, అప్పటి నుంచి దాని గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఇటీవల మదనపల్లిలోని రెవెన్యూ కార్యాలయంలో కొందరు ఫైళ్లు చోరీ చేసి తగుల బెట్టిన ఉదంతం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ కార్యాలయాల్లో సీసీ కెమెరాలతో పాటు రాత్రీపగలు రెవెన్యూ రికార్డు రూమ్ వద్ద సెక్యూరిటీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అయితే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని సీసీ కెమెరా మాత్రం ఇప్పటికీ పని చేయడం లేదు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు సీసీ కెమెరా నిఘా ఏర్పాట్లు విషయంలో శ్రద్ధ కనబరచాలని మండల ప్రజలు కోరుతున్నారు.